క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఆగస్టు 2025 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోపా, డ్రాఫ్ట్‌సమన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడర్స్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 వరకు దరఖాస్తు గడువు ఉందని ఆసక్తి గల విద్యార్థులు రూ.100 చెల్లించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న దేవేందర్ పటేల్

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్, సోమనపల్లి గ్రామాల మధ్య ఉన్న పురాతనమైన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్‌ప్రతిష్ఠకు కేటీఆర్ సేన జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దేవేందర్ పటేల్ రూ.10.116లు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు నందికొండ రాంరెడ్డి, పెంట రమేశ్, పెద్దోజు రమణాచారి, పోతనవేన ఐలయ్య, శ్రీకాంత్, భీష్మాచారి, రాజయ్య, రమాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి: బీజేపీ మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా బల్గూరి కిషన్ రావు, రాస భిక్షపతి, తెప్ప రాజు, అన్నం రజిత, ప్రధాన కార్యదర్శులుగా బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణారెడ్డి, కార్యదర్శులుగా పులి భాస్కర్‌రెడ్డి, వైనాల ప్రియాంక శివ కుమార్, ఎలిగేటి తిరుపతి, కక్కర్ల వీరన్న, కోశాధికారిగా వంగ రవిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత



ఏటూరునాగారం: ఏటూరునాగారం జంపన్నవాగు వద్ద పట్టాల్యాండ్ ఇసుక క్వారీ నుంచి అదనపు లోడుతో వెళ్తున్న లారీని చిన్న బోయినపల్లివద్ద పట్టుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ మంగళవారం తెలిపారు. రెండున్నర టన్నుల ఇసుక ఎక్కువగా ఉండడంతో లారీ యజమాని పెద్ద కొమురయ్య, డ్రైవర్ జావిద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. లారీని స్టేషన్‌కు తరలించి టీఎస్ఎండీసీ వారికి సమాచారం ఇచ్చామన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి



సమ్మయ్య(ఫైల్)

గోవిందరావుపేట: లక్నవరం చెరువులో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుస్సాపూర్ గ్రామానికి చెందిన కాలేని సమ్మయ్య (40) కొన్ని సంవత్సరాలుగా హమాలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం హమాలీలు అందరూ కలిసి చెరువును చూడటానికి వెళ్లారు. భోజనం చేస్తున్న సమయంలో కాలేని సమ్మయ్య కనపడకపోవడంతో చుట్టూ పక్కల చూడగా చెరువులో మృతదేహాన్ని గమనించారు. పస్రా పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పొలాలకు సేంద్రియ ఎరువు

- ట్రాక్టర్లతో తరలిస్తున్న రైతులు
- పెరగనున్న పంటల దిగుబడి



వాజేడులో ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఎరువు

వాజేడు: చాలా మంది రైతులు గతంలో పశువుల పేడ, మేకల పెంట లాంటి సేంద్రియ ఎరువును నిల్వ చేసి పొలాల్లో కలియదున్నేవారు. ఈ మధ్య కాలంలో అలాంటి పనులను చేపట్టకపోవడంతో పంటలకు తెగుళ్ల బెడద పెరిగింది. దీంతో మండలంలో గతంలో చేసిన సాగు పద్ధతులను పాటిస్తూ రైతులు సేంద్రియ ఎరువును పొలాలకు, చెలుకలకు తరలిస్తున్నారు. పాత రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న రైతులు సేంద్రియ ఎరువును ట్రాక్టర్ల ద్వారా రైతులు తరలిస్తున్నారు.

సారవంతంగా మారనున్న భూమి

రసాయనిక ఎరువులతో భూమిలో ఉన్న సారం తగ్గడంతో పాటు భూమిలో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలు, సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ దిగుబడులను పెంచడం కోసం రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. కాగా ప్రస్తుతం రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వలన భూమి సారవంతంగా తయారవుతుంది. దీంతో పంట మొక్కలు ఏపుగా పెరుగడానికి ఆస్కారం ఉంది. పంటను తెగుళ్ల ఆశించే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. రైతులు రసాయనిక ఎరువుల భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా సేంద్రియ ఎరువును తమ ఇంటి పరిసరాల్లో తయారు చేస్తున్నారు. పశువుల పేడ, మేకల పెంటను, ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త చెదారాన్ని ఒక చోటకు చేర్చి దానిని కుళ్ల బెడుతున్నారు. అది ఎరువుగా మారిన తర్వాత రైతులు పొలాలు, చేలకు తరలిస్తున్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్ నాయక్



విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

గోవిందరావుపేట: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ములుగు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్ నాయక్ అన్నారు. మండలంలోని చల్వాయి, పస్రా విత్తనాల షాపుల్లో పస్రా ఎస్సై అచ్చ కమలాకర్, మండల వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డిలతో కలిసి టాస్క్ ఫోర్స్ సీఐ రమేశ్ నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ నాయక్, ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే కేసులు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాల విక్రయాల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్ఠం చేసి అక్రమార్కులపై పీడీ యాక్ట్ అమలు చేస్తాం అని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మడానికి ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే డయల్ 100కి లేదా పస్రా పోలీస్ స్టేషన్ నెంబర్ 87126 70086, ఎస్సై కమలాకర్ 87126 00858కి సమాచారం అందించాలన్నారు.

ధాన్యంలో కోతలు పెట్టొద్దు



మాట్లాడుతున్న రైతులు

ఏటూరునాగారం: మండలంలోని జీసీసీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలివెళ్లిన ధాన్యంలో కోతలు పెట్టొద్దని రైతులు కొమురయ్య, రాజ్‌కుమార్, రాజు, సమ్మయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆరుగాలం పండించిన పంటలు కోతలు విధించొద్దన్నారు. తేమ పేరుతో పది కిలోలు కోతలు విధిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని వెల్లడించారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ



పనుల వివరాలను వెల్లడిస్తున్న మహిపాల్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై జరిగిన సోషల్ ఆడిట్ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. గ్రామ సభకు సామాజిక తనిఖీ డీఆర్‌పీ మహిపాల్ హాజరై గ్రామంలో తనిఖీ చేసిన లోటుపాట్లను వివరించారు. గ్రామస్తుల స్టేట్‌మెంట్‌ను స్వీకరించారు. పనులు పారదర్శకంగా చేపట్టి కూలీలకు కావాల్సిన నగదు చెల్లించినట్లు ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సాంబశివరావు, సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల్లో అవినీతి, అక్రమాలను బయటపెట్టేందుకు నేడు(బుధవారం) ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయితే ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలకు జరుగుతున్నప్పటికీ అవి బయటకు రాకుండా ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సర్దిచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంద రోజుల పనుల్లో అవినీతి అక్రమాలకు నిక్షప్తతపాతంగా బయటపెట్టాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వీరునాయక్



మల్హర్: విత్తన బ్యాగులు ఇస్తున్న ఏఓ శ్రీజ

- జిల్లా వ్యవసాయ అధికారి వీరునాయక్

మొగుళ్లపల్లి: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి వీరునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో తయారు చేయబడిన వరి, పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఏడీఏ నేరెళ్ల రమేశ్, పీజేటీఏయు శాస్త్రవేత్త బైరి రాజు, మండల వ్యవసాయ అధికారి, సురేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

మల్హర్: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రైతువేదిక కార్యాలయంలో మంగళవారం రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో తయారు చేయబడిన వరి, పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీజ మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తంలో కార్యక్రమంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. డబ్ల్యూజీఎల్ 962 రకం వరి విత్తనాలు 10 కేజీల బ్యాగ్ రూ.50, ఎంజీజీ385 పెసర విత్తనాలు 3 కేజీల బ్యాగ్ రూ.50 చొప్పున రెండు వరి విత్తనాల బ్యాగ్‌లు, ఒక్క పెసర విత్తనాల బ్యాగ్ చొప్పున మండలంలోని 18 రెవెన్యూ గ్రామాలకు 36 వరి విత్తన బ్యాగులు, 18 పెసర విత్తన బ్యాగ్‌లను రైతులకు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు పృథ్వీ, శిరీష, అనూష, ఆయా గ్రామల రైతులు పాల్గొన్నారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి మహేందర్



మాట్లాడుతున్న వైద్యుడు మహేందర్

వాజేడు: వర్షాకాలంలో ఆశకార్య కర్తలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కొమరం మహేందర్, అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం డాక్టర్ మధుకర్‌తో కలిసి ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. జ్వరంతో బాధపడుతున్న వారిని వెంటనే వైద్యశాలలో చేర్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. జూన్ 9 నుంచి రాపిడ్ ఫీవర్ సర్వే ప్రారంభం అవుతుందని జ్వరాలు ఉన్న వారిని గుర్తించి ఆస్పత్రులకు తరలించడంతో పాటు జ్వరం తగ్గే వరకు పరిశీలించాలన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

- తహసీల్దార్ జగదీశ్



వెంకటాపురం(కె): రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: భూ సమస్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జగదీశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ హాజరై మాట్లాడారు. భూ భారతి పోర్టల్‌లో ద్వారా భూ సమస్యలు, పట్టా ఒకరిపై ఒకరు, ఇతర సమస్యలను పరిష్కరించుకునేందుకు సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కారం

భూ భారతి ద్వారా రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఏర్పాటు చేసినట్లు నయాబ్ తహసీల్దార్ రాహుల్ తెలిపారు. కొయ్యగూడ ఎల్లాపురంలో రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఏ సమస్య ఉన్న వారి దరఖాస్తులను అందజేయాలన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం, మరికాల గ్రామాల్లో మంగళవారం భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుల్లో గ్రామల్లో ఉన్న భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బెస్తగూడెం సదస్సులో 144, మరికాల సదస్సులో 155 దరఖాస్తులను వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ గోణుగోపాల్, డిప్యూటి తాహసీల్దార్ మహేందర్ , రెవిన్యూ సిబబంది తదితరులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, నాగారం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ప్రగళ్లపల్లిలో తహసీల్దార్ శ్రీనివాస్, నాగారంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ కుమారస్వామి పాల్గొన్నారు. నాగారంలో భూ భారతి సమస్యలపై 24 దరఖాస్తులు రాగా ప్రగళ్ల పల్లిలో 35 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ చెప్పారు.



వాజేడు: దరఖాస్తులు అదజేస్తున్న రైతులు

గోవిందరావుపేట: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సృజన్ కుమార్ అన్నారు. మండలంలోని ప్రాజెక్ట్ నగర్ గ్రామంలో మంగళవారం భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు, ప్రజలు వినియోగించుకొని లబ్ధి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, పంచాయతీ సెక్రటరీ సృజన, జూనియర్ అసిస్టెంట్లు అజ్మీర రాజు, రాజేష్, శ్యాం పాల్గొన్నారు.



గోవిందరావుపేట: మాట్లాడుతున్న తహసీల్దార్



ఏటూరునాగారం: రామన్నగూడెంలో..



ఏటూరునాగారం: కోయగూడ ఎల్లాపురంలో..

ధ్యానంతో మానసిక ప్రశాంతత

శాయంపేట : యోగా, ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ రామచంద్ర మిషన్ సంస్థ కో ఆర్డినేటర్ శారద అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ హై స్కూల్‌లో శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యోగా, ధ్యానంతో ఆరోగ్యంతో పాటు, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. మనిషి తన శరీరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకునేందుకు ధ్యానం అవసరమన్నారు. విద్యార్థులు ధ్యానం చేయడం వలన ఏకాగ్రత పెరిగి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని అన్నారు. మొదటి రోజు 50 మంది యోగా, ధ్యాన్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. శ్రీ రామచంద్ర మిషన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ అచ్చయ్య, రమేశ్, రాంబాబు, సత్యనారాయణ, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో మేలు

శాయంపేట : మట్టి పరీక్షలతో భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఏఓ గంగాజమున సూచించారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో మంగళవారం మట్టి నమూనాలు సేకరించే విధానం, మట్టి పరీక్షల వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు మట్టి పరీక్షలు చేసుకోవడం వలన పంట ఉత్పత్తిని మెరుగుపరచడం, వ్యయాన్ని తగ్గించడం, భూమి ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మట్టిలో ఉన్న పోషకాలు పీహెచ్ స్థాయిని బట్టి ఏ పంటకు భూమి అనుకూలంగా ఉంటుందో తెలుసుకోవచ్చన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంగపేట: మండలంలోని తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని అబ్బాయిగూడేనికి చెందిన తుడుందెబ్బ నాయకుడు అల్లెం నర్సింహారావు సోమవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు తాటి కృష్ణ, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్ నాయకులతో పరామర్శించారు. నర్సింహారావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. మేడారం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ చిలకమర్రి రాజేందర్, ములుగు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరెం సంతోష్, మాజీ సర్పంచ్ కోరెం నారాయణ, ఉపసర్పంచ్ కోరెం వెంకటేశ్వర్లు, మండల నాయకులు గాదె శ్రీనివాసాచారి, జగదీశ్, పాయం రమేశ్, మోహన్‌రావు, అమిలి చంద్రం, ముత్తెబోయిన నర్సింహారావు, అర్జున్, పొదెం రాంబాబు, దంతెనపెల్లి నరెందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పూజారి సతీశ్ ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

- తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా



వాహనాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి, నవాబుపేట చలివాగు పరివాహక ప్రాంతాలలో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా అన్నారు. మంగళవారం మండలంలోని అందుకుతండా గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్లు వెళ్లుతున్న క్రమంలో వాహనాలను తనిఖీ చేయగా డ్రైవర్ల దగ్గర ఏలాంటి సరైనా అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని ఆపి అవగాహన కల్పించారు. ట్రాక్టర్లకు ఏలాంటి నంబర్ ప్లేట్లు లేకపోవడంతో అక్కడే వాహనాలను ఆపి నంబర్లు రాయించారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాల్వపల్లి, అందుకుతండా, నేరేడుపల్లి గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లకు తహసీల్దార్ జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళి




నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరులంతా బీసీ, ఎస్సీ, ఎస్టీలే అన్నారు. కాని రాష్ట్రం వచ్చాక అధికారంలోకి వచ్చింది మాత్రం అగ్రకులాల వారని వాపోయారు. నాయకులు కాసగాని దేవేందర్‌గౌడ్, హబీబ్ పాషా, కందేరవి, పుల్ల అశోక్, పర్లపెల్లి కుమార్, నేరేళ్ల రమేశ్, కోర్లశ్యామ్, రవీందర్, ప్రసాద్, ప్రతాప్ పాల్గొన్నారు.

రేషన్ కార్డు స్టేటస్ ఏంటో?

- తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- జారీకాని కార్డులు



రేగొండ: కొత్త రేషన్‌కార్డుల కోసం, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడానికి ప్రజలు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులకు మొబైల్ యాప్‌ను అందజేశారు. రెండు నెలల క్రితం దరఖాస్తులు పరిశీలించిన కార్యదర్శులు వాటిని ఉన్నతాధికారులకు పంపించారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డులు జారీ కావడం లేదు. కుటుంబ సభ్యులు పేర్లు నమోదు కావడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.


మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

కుటుంబ సభ్యుల పేర్లు, నమోదు కార్డుల విభజన కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న వారికి కొత్త కార్డులు జారీ అయ్యాయి. కుటుంబ సభ్యుల పేర్లు నమోదు అవుతున్నాయి. దరఖాస్తు ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందో తెలుసుకునే వీలుంది. మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు చాలా పరిష్కారించారు. ఐదు సంవత్సరాల పిల్లల పేర్లను రేషన్ కార్డులో నమోదు చేయడానికి సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రేగొండ మండలంలో రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు కోసం దాదాపు 2000 దరఖాస్తులు రాగా, కొత్త రేషన్ కార్డుల కోసం దాదాపు 900 వచ్చాయి. ఇందులో కొందరికి రేషన్ కార్డులు రాగా కొంత మందికి పేర్లు నమోదు అయ్యాయి. ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉండగా వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మళ్లీ వేచి చూడడమేనా..

ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల స్టేటస్ కనిపించడం లేదు. మీసేవా కేంద్రాల ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లో పరిష్కారం అయ్యే అవకాశాలున్నాయి. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. దరఖాస్తు స్టేటస్ ఏమిటో చూసుకోవచ్చు. రేషన్ కార్డు రాకపోతే మీసేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకుంటే ఎక్కడ పెండింగ్ ఉందో స్టేటస్ తెలుసుకోవచ్చు.

స్టేటస్ తెలుసుకోవచ్చు



మీసేవా కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నా, కొత్త కార్డు అప్లై చేసుకున్నా పెండింగ్‌లో ఎక్కడుందో తెలుసుకోవచ్చు.

– వేణు, మీసేవ నిర్వాహకుడు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944